ఓటరన్నా..ఈ రోజు నీదే..!

ఓ ఓటరూ..నీకంటూ ఓ రోజొచ్చింది.
నిన్ను పాలించే నాయకుడిని
నువ్వే ఎన్నుకునే రోజిది.
నీ కుటుంబ సంక్షేమానికి..
నీ పిల్లల భవిష్యత్‌కు..
ఎవరు మేలు చేస్తారో
నువ్వు నిర్ణయించే రోజిది.
ఏ ప్రలోభాలకు లొంగకు..
ఆచితూచి ఓటేయ్..
నీ నాయకుడిని నువ్వే ఎన్నుకో..

- సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం
- నియోజకవర్గంలో 2,40,079 మంది ఓటర్లు
- 297 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్న ఓటర్లు
- 25 సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలు



కనిగిరిలో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



కందుకూరులో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు

కనిగిరి రూరల్: సార్వత్రిక పోరుకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2,40,079 మంది ఓటు హక్కు కల్గియున్నారు. వారిలో 1,21,356 మంది పురుషులు, 1,18,710 మంది మహిళలు, 13 మంది ఇతరులున్నారు. హెచ్‌ఎంపాడు మండలంలో 23,463 మంది, వెలిగండ్ల మండలంలో 28,655 మంది, సీఎస్ పురం మండలంలో 34,259 మంది, కనిగిరి మున్సిపాలిటీలో 34,280 మంది, కనిగిరి రూరల్ మండలంలో 38,483 మంది, పీసీపల్లి మండలంలో 29, 364 మంది, పామూరు మండలంలో 51,575 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా నియోజకవర్గంలోని 297 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఎన్నికల విధి నిర్వాహణలో 3వేల మంది పోలింగ్ సిబ్బంది:

ఎన్నికల విధి నిర్వహణలో పోలీసులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సుమారు 3వేల మంది విధి నిర్వహణలో పాల్గొంటారు. వారిలో 1800 మంది పోలింగ్ సిబ్బంది, పోలీసులు, ఇతరులు సుమారు 1200 మంది పాల్గొననున్నారు. ఈమేరకు వారి వారి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 13న సోమవారం ఉదయం 5 గంటల కల్లా ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. 7 గంటలకు రెగ్యులర్ పోలింగ్ ప్రారంభం అవుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు. సుమారు 60 ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను వినియోగించారు. సదరు ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాలపర్తి జాన్ ఇర్విన్, జనరల్ అబ్జర్వర్‌లు పర్యవేక్షించారు. నియోజకవర్గ ఏఆర్ఓల పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రి తరలింపు ప్రక్రియ జరిగింది. 39 మంది సెక్టార్ అధికారులు అన్ని రూట్‌లలో తిరుగుతూ పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను అన్ని మండలా కేంద్రాలకు, నియోజకవర్గ కేంద్రానికి సమాచారం అందిస్తారు.

25 సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలు:

డివిజన్‌లో 25 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించినట్లు డీఎస్పీ రత్నాకర రామ రాజు తెలిపారు. నల్గురు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, 400 మంది పోలీసులు, 150 సీపీఎఫ్ సిబ్బంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారు. ఎన్నికల నియ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఓటర్లను ప్రలోభ పెట్టినా, బెదిరించినా, కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఆర్ రామరాజు తెలిపారు.

పామూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. 68 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం సాయంత్రానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ బూత్‌లలో మొత్తం 51,575 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 25,697, స్త్రీలు 25,878 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 10 సెక్టార్లు కాగా 11 రూట్‌లుగా విభజించారు. పోలింగ్ బూత్‌లలో 408 సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. అదేవిధంగా సీఐ, ఎస్సైలతో పాటు తమిళనాడుకు సంబంధించి ప్రత్యేక బలగాలు, బీఎస్ఎఫ్ బలగాలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు మొత్తం 105 మంది విధుల్లో పాల్గొని శాంతి భద్రతను పర్యవేక్షించనున్నారు.

సీఎస్‌పురం(పామూరు): సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండలంలో మొత్తం 43 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 34,259 మంది ఓటర్లు కాగా వారిలో 17,399 మంది పురుషులు, 16,859 మంది స్త్రీలు, ఒకరు థర్డ్‌జండర్ ఉన్నారు. పోలింగ్ బూత్‌లలో 258 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. మండలాన్ని మొత్తం 6 సెక్టార్లగాను, 6 రూట్‌లుగా విభజించారు. అదేవిధంగా భద్రతకు సంబంధించి సీఐ, ఎస్సైతో పాటు తమిళనాడుకు సంబంధించి ప్రత్యేక బలగాలు, ఏఆర్‌బీసీలు, పీసీలు, మహిళాపోలీసులు, మేల్, ఫిమేల్ హోంగార్డులు మొత్తం 91 మంది విధులు నిర్వహిస్తున్నారు.

పీసీపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఏఆర్‌ఓ పద్మావతి తెలిపారు. మండలంలోని 39 బూత్‌లలో ప్రతి పోలింగ్ బూత్‌కు ఆరుగురు సిబ్బంది, ఆరుగురు సెక్టార్ అధికారులను నియమించారు. ఇందులో భాగంగా 10 మంది తమిళనాడు పోలీసులు, 4సీఆర్‌పీఎఫ్ మొత్తం 50 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు. ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలింగ్ ముగిసే వరకు మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

వెలిగండ్ల: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎం డానియేల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 238 మంది ఎన్నికల సిబ్బందిని 5 మంది రూట్ ఆఫీసర్లు వారిని పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చారు. సెక్టార్ ఆఫీసర్‌గా ఎంఈఓ ప్రసాద్‌ను నియమించారు. ఎన్నికలు సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. 21 గ్రామ పంచాయితీల్లో 34 పోలింగ్ బూత్ ఉండగా వాటి పరిధిలో 28655 మంది ఓటరు ఉన్నారు. వారిలో 2389 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ్మినేనిపల్లి, మొగళ్లూరు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగాఎంపిక చేశారు. మరపగుంట్ల గ్రామాన్ని పొలిటికల్ సెన్సిటివ్ గ్రామంగా ఎంపిక చేసి ఆ గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో పాటు ఐదుగురు చొప్పున సీఆర్‌పీఎఫ్ బలగాలను నియమించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎం డానియేలు తెలిపారు.

హనుమంతునిపాడు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 23 పంచాయతీలో నాలుగు రూట్లలో 29 పోలింగ్ బూతులో పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 23,463 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో స్త్రీలో 11,482 మంది, పురుషులు11,981 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 29 పోలింగ్ కేంద్రాల్లో నాలుగు రూట్లలో 169 మంది పోలింగ్ సిబ్బంది, 53 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తహసీల్దార్ కిషోర్‌రెడ్డి తెలిపారు. సమస్యాత్మక గ్రామాలైన తిమ్మారెడ్డిపల్లి, వేములపాడులో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



సీఎస్‌పురం పోలింగ్ కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లు

కొండపి (సింగరాయకొండ): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం కొండపి నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నట్లు రిటర్నింగ్ అధికారి ఎ.కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 239609 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 118624, స్త్రీలు 120982, థర్డ్ జెండర్ 3 మంది ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు ఎటువంటి వాహనాన్ని అనుమతించమని, సమస్యాత్మక గ్రామాలకు చెందిన పోలింగ్ బూత్‌లలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో, సీసీ కెమెరాలు అందుబాటులో లేని కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ పోలింగ్‌ను పర్యవేక్షిస్తాడని తెలిపారు. ప్రతి రెండు మండలాలకు ఒక బెల్ ఇంజినీర్, ప్రతి 10 పోలింగ్ కేంద్రాలకు సెక్టార్ అధికారులను నియమించామని, సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేవారు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక్క గుర్తింపు కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని చెప్పారు. వికలాంగులకు, వృద్ధులకు, గర్భిణులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, ర్యాపిడ్ యాక్షన్ టీమ్స్ బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి

కందుకూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా కీలకమైన పోలింగ్ ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా జరగనుంది. నియోజంవకర్గంలోని 271 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణలకు ఇప్పటికే అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా స్థానిక టీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ఈవీఎంల, ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల హాజరుకావాల్సిన సిబ్బంది ఉదయాన్నే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సెక్టార్‌ల వారీగా పోలింగ్ కేంద్రాలకు అధికారులను కేటాయించిన రిటర్నింగ్ అధికారి విద్యాధరి ఈవీఎంలను, ఎన్నికల మెటీరియల్‌ను అందజేశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో విధుల్లో చేరే విధంగా కొంత మంది అధికారులను రిజర్వ్‌లో అందుబాటులో ఉంచారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అబ్జర్వర్‌లను, పీఓ, ఏపీఓలను, ఇతర ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. వీరికి అందించిన ఈవీఎం, ఎన్నికల మెటీరియల్‌తో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు పెద్ద ఎత్తున ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, అధికారులు సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఏర్పాటు చేసుకోవాలని, ఏ సమస్య ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆర్ఓ సూచించారు. ఈవీఎంలల్లో ఎక్కడైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎక్కడా చిన్న పొరపాట్లకు కూడా తావు లేకుండా పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలు చేయడంతో పాటు, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాలని, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆర్ఓ తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

జరుగుమల్లి (సింగరాయకొండ): కొండపి నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 284 పోలింగ్ బూత్‌లు ఉండగా ఎన్నికల సిబ్బంది ఒక్కో బూత్‌కు 7 గురు చొప్పున మొత్తం 1,988 మంది ఉన్నారన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని సీఐ రంగనాథ్ వివరించారు.



పీసీపల్లిలో పోలింగ్ బూత్‌కి వస్తున్న సిబ్బంది



వెలిగండ్లకు చేరిన ఎన్నికల సిబ్బంది



కొండపిలో పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో చేరుకున్న సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌ఓ విద్యాధరి